ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 22.0
ANDHRAJYOTHY 5

వనపర్తి జిల్లా వార్తలు
సోమవారం 5 ఆగస్టు 2024

థర్డ్ డిగ్రీ..?

- శ్రీధర్ రెడ్డి హత్య కేసులో పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 48 గంటలు అవుతున్నా సమాచారం ఇవ్వలేదంటున్న కుటుంబ సభ్యులు
- వివాదాస్పదమవుతున్న వనపర్తి పోలీసుల తీరు


హత్యకు గురైన శ్రీధర్ రెడ్డి (ఫైల్)


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఐజీ సత్యనారాయణ, డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ (ఫైల్)

వనపర్తి క్రైం, ఆగస్టు 4: వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని లక్ష్మీపల్లి గ్రామంలో మే 22న దారుణ హత్యకు గురైన బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి ఉదంతం రాష్ట్ర వ్యాప్తంగా సంచలన సృష్టించిన విషయం తెలిసిందే. ఈ హత్య జరిగి రెండు నెలలు గడిచినా ఈ కేసు పోలీసులు చేధించడంలో విఫలమయ్యారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ హత్యను బీఆర్ఎస్ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకున్నది. హత్య జరిగిన రోజు బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లక్ష్మీపల్లి గ్రామానికి చేరుకుని శ్రీధర్ రెడ్డి అంత్యక్రియలో పాల్గొన్నారు. మంత్రి జూపల్లి అనుచరులే ఈ హత్య ఉదంతానికి పాల్పడ్డారని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. కేటీఆర్ ఆరోపణలపై స్పందించిన జూపల్లి కృష్ణారావు శ్రీధర్‌రెడ్డి వ్యక్తిగత కారణాల వల్లనే హత్యకు గురయ్యారని, ఆ హత్యకు కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని ధీటుగా జవాబు ఇచ్చారు. ఈ హత్యపై దాదాపు నెల రోజులు రాజకీయ రంగు పులుముకుని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో పోలీసులు ఆలస్యం చేయడంతో బాధిత కుటుంబ సభ్యులు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులతో కలిసి డీజీపీకి ఫిర్యాదు చేసినా కేసు కొలిక్కి రాలేదు. గత నెలలో హైదరాబాద్‌లో కలెక్టర్, ఎస్పీలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా స్పందించి శ్రీధర్‌రెడ్డి హత్య కేసులో ఉన్న నిందితులను పట్టుకోవడంలో ఎందుకు విఫలమ య్యారని నిలదీశారు. నిందితులను త్వరగా పట్టుకొని బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని ఆదేశించారు. దీంతో వెంటనే డీజీపీ ఆదేశాల మేరకు గత నెల 16వ తేదీన ఐజీ సత్యనారాయణ, డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ లక్ష్మీపల్లి గ్రామానికి చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అప్పటి వరకు విచారణ అధికారిగా ఉన్న అధికారిని తప్పించి వేరొకరికి బాధ్యతలు అప్పగించారు. గత 15 రోజులుగా గ్రామంలో విచారణ చేయడంతో పాటు శ్రీధర్ రెడ్డికి సన్నిహితంగా ఉండే వ్యక్తులతో పాటు, అతనికి గతంలో ఉన్న పాత కక్షల నేపథ్యంలో ఉన్న వారి వివరాలను అడిగి తెలుసుకు న్నారు. అయినా ఈ కేసు కొలిక్కి రాలేదు. శనివారం తెల్లవారు జామున అనుమానిత వ్యక్తులతో పాటు వారికి సన్నిహితంగా ఉండే వారిని విచారణ పేరుతో నోటీసులు ఇవ్వకుండా అదుపులోకి తీసుకున్నారు.

మనోవేదనకు గురవుతున్న బాధిత కుటుంబ సభ్యులు

విచారణ పేరుతో అదుపులోకి తీసుకున్న వారి సమాచారాన్ని పోలీసులు బయటికి రానివ్వకుండా జాగ్రత్త పడుతున్నారు. వారిని ఎక్కడికి తీసుకువెళ్లారు? ఏం చేస్తున్నారు..? అనే విషయాలను స్థానిక పోలీసులతో పాటు, జిల్లా ఉన్నతాధికారులు కూడా సమాచారం ఇవ్వడం లేదని బాధిత కుటుంబ సభ్యులు మనోవేదనకు గురవుతున్నారు. మా వారికి ఏం జరిగిన పోలీసులదే బాధ్యత అని మండిపడుతున్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అని ప్రచారాలు చేసుకునే పోలీసులు అసలైన నిందితులను పట్టుకోకుండా అమాయకులను పట్టుకొని వేధించడం ఎంత వరకు సమంజసం అని వాపోతున్నారు. ఈ కేసులో అదుపులోకి తీసుకున్న మహేష్ రెడ్డి అనే వ్యక్తి భార్య గర్భిణీ, వాళ్ల తండ్రి పెరాలసిస్‌తో బాధపడుతున్నాడు. ఇప్పటి వరకు మహేష్‌రెడ్డితో పాటు వారి తల్లిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వలేదు. దీంతో మహేష్ రెడ్డి భార్య వారి కుటుంబ సభ్యులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

రాజకీయ బలం లేని వారే టార్గెట్

ఈ కేసులో రాజకీయ ప్రోద్బలం లేని అమాయకులనే పోలీసులు టార్గెట్ చేసి అదుపులోకి తీసుకుని వేధిస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ కేసులో రాజకీయ పలుకుబడి ఉన్న నాయకుల కుటుంబ సభ్యులకు చెందిన వారిని ఎవరినీ కూడా అదుపులోకి తీసుకోలేదని సమాచారం. కేవలం గ్రామంలో వ్యవసాయంతో పాటు ఇతరాత్ర పనులు చేసుకునే వారిని విచారణ పేరుతో అదుపులోకి తీసుకుని థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారని.. పోలీసులకు చేతనైతే అసలైన నిందితులను పట్టుకోవడంలో ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని మండి పడుతున్నారు. ఈ విషయంపై విచారణ అధికారితో పాటు ఉన్నత అధికారులను వివరణ కోరేందుకు సంప్రదించినా అందుబాటులోకి వచ్చినా సమాధానం దాటవేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

అదుపులోకి తీసుకున్న వారిపై ..?

శ్రీధర్ రెడ్డి హత్య కేసులో పోలీసులు విచారణ పేరుతో పదుల సంఖ్యలో పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. శనివారం తెల్లవారు జామున లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన వారితో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన వారిని విచారణ పేరుతో నోటీసులు, సమాచారం ఇవ్వకుండా అదుపులోకి తీసుకున్నారు. 48 గంటలు గడిచినా అదుపులోకి తీసుకున్న వారి సమాచారాన్ని వారి కుటుంబ సభ్యులకు కూడా ఇవ్వట్లేదని తెలుస్తోంది. అదుపులోకి తీసుకున్న వారిని విచారణ పేరుతో వనపర్తి జిల్లాలో కాకుండా సంగారెడ్డి జిల్లాకు సమీపంలోని పోలీస్ స్టేషన్లకు తీసుకువెళ్లి వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు ఫ్రెండ్లీ పోలీసింగ్ పేరుతో కార్యక్రమాలు చేసుకుంటూ ప్రజల్లోకి వెళ్తుంటే వనపర్తి జిల్లా పోలీసుల తీరు మాత్రం వివాదాస్పదంగా మారింది. రోజురోజుకూ పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని పోలీసులు అసలైన నిందితులను పట్టుకోకుండా అమాయకులను వేధిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.


హత్య జరిగిన రోజు లక్ష్మీపల్లి గ్రామంలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్, మాజీ ఎమ్మెల్యేలు

పర్యాటక ప్రాంతాలుగా జిల్లా ప్రాజెక్టుల అభివృద్ధి

- కోయిల్‌సాగర్, సరళాసాగర్, కురుమూర్తి ఆలయ అభివృద్ధికి రూ.3 కోట్లు
- కోయిల్‌సాగర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా
- మంత్రి జూపల్లి కృష్ణారావు


సరళాసాగర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు

దేవరకద్ర/ చిన్నచింతకుంట, ఆగస్టు 4: ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులను జాతీయ పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తానని పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. స్టడీటూర్‌లో భాగంగా ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని కోయిల్‌సాగర్, సరళాసాగర్, కురుమూర్తి ఆలయాన్ని ఎమ్మెల్యేలతో కలిసి సందర్శించారు. ముందుగా కురుమూర్తి ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం కోయిల్‌సాగర్ ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడారు. రాష్ట్రంలో ప్రపంచస్థాయి పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ ప్రకృతి రమణీయమైన ప్రదేశాలు, పుణ్యక్షేత్రాలు, సంపదకు నెలవుగా ఉందని అన్నారు. ఎన్నో అవకాశాలు, వనరులు ఉన్నప్పటికీ గడిచిన పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం పర్యాటక ప్రాంతాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ఉన్న పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. టూరిజంలో భాగంగా కురుమూర్తి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ టూరిజం డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు స్వామి వారి ఆలయానికి రావటం తనకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి మాట్లాడుతూ సీఎం సొంత జిల్లాను అభివృద్ధి చేసేందుకు ఎంతో కృషి చేస్తున్నారు. పాలమూరు జిల్లాను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేసి పాలమూరు నుంచి టూరిజం బస్సుల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అనంతరం మంత్రి, ఎంపీ, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో బోటు ప్రయాణం చేశారు.

సరళాసాగర్ ప్రాజెక్టు పరిశీలన

మదనాపురం : టూరిజం స్టడీ టూర్‌లో భాగంగా మంత్రి నేతృత్వంలో ఎంపీ మల్లురవి, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఆదివారం సరళాసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాలపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం చూపించిందని అన్నారు. రాష్ట్రంలో ప్రపంచ స్థాయి పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని అన్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి పాలమూరులో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, పర్యాటకులను ఆకర్షించడం, పర్యాటక ప్రాంతాలను ప్రాచుర్యంలోకి తీసుకురావడం, మౌలిక వసతుల కల్పన, రహదారుల నిర్మాణం తదితర అంశాలపై అధ్యయనం చేస్తున్నామని వివరించారు. ఆసియా ఖండంలోనే రెండవదైన ఆటోమెటిక్ సైఫిన్ సిస్టం ఉన్న సరళాసాగర్‌తో పాటు, కోయిల్‌సాగర్‌ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని అన్నారు. వీలైతే ఈ రోజు సాయంత్రంలోపు కొంత మేర నిధులు విడుదల కూడా చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి, వీర్లపల్లి శంకర్, వాకిటి శ్రీహరి, చిక్కుడు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, సీడబ్ల్యూసీ మెంబర్ చల్లా వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, వనపర్తి అదనపు కలెక్టర్, రెవెన్యూ నగేష్ ఉన్నారు.

కొలిక్కి వచ్చింది

- చికెన్ వ్యర్థాలకు నేడు బహిరంగ వేలం


పట్టణంలో చికెన్, చేపల వ్యర్థాలను తరలిస్తున్న వ్యాపారులు(ఫైల్)

వనపర్తి టౌన్, ఆగస్టు 4: వనపర్తి మునిసిపాలిటీలో కొన్ని నెలలుగా నెలకొన్న చికెన్ వ్యర్థాల తరలింపు అంశం ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. ఎన్నో ఏళ్లుగా చికెన్, చేపల వ్యర్థాలకు బహిరంగ టెండర్ వేయకుండా ఒక వర్గానికి చెందిన వ్యక్తులే లోలోపల ప్రజా ప్రతినిధులు, అధికారులకు ముడుపులు చెల్లించి సొమ్ము చేసుకునే వారు. మునిసిపాలిటీకి రావాల్సిన లక్షల ఆదాయానికి బహిరంగంగానే గండి కొడుతున్నారు. ఈ మోసాన్ని గుర్తించిన ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురణ చేసింది. జూలై 11న 'కోళ్ల వ్యర్థాలతో రూ. కోట్లు స్వాహా' అనే కథనం, తిరిగి జూలై 31న 'వ్యర్థాల వేలం ఉన్నట్టా? లేనట్టా?' అనే కథనాలతో అధికారులు, నాయకుల్లో చలనం తీసుకొచ్చింది. కథనాకు స్పందించిన కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే చికెన్, చేపల వ్యర్థాలకు బహిరంగ వేలం నిర్వహించాలని ఆదేశించడంతో ఎట్టకేలకు బహిరంగ వేలం నిర్వహించేందుకు మునిసిపల్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం సాయంకాలం మూడు గంటలకు మునిసిపల్ కార్యాలయంలో చికెన్, చేపల వ్యర్థాల తరలింపు కోసం బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఆంధ్రజ్యోతి కథనాలతో మునిసిపాలిటీకి లక్షల్లో ఆదాయం రానుందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


వనపర్తి మునిసిపల్ కార్యాలయం

గుప్పుమంటున్న గంజాయి

- టీనేజర్లే టార్గెట్‌గా అమ్మకాలు
- జిల్లాలో యథేచ్ఛగా నల్లబెల్లం రవాణా
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

నాగర్‌కర్నూల్ జిల్లాలో గంజాయి, గుడుంబా గుప్పుమంటోంది. యువకులే లక్ష్యంగా గంజాయి అమ్మకాలు చేస్తున్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో సాగు చేసిన గంజాయిని మైదాన ప్రాంతాలకు తరలిస్తూ స్మగ్లర్లు కాసులు కురిపించుకుంటున్నారు. నల్లమలలో గుట్టుగా సాగు చేసిన గంజాయిని కృష్ణా నది పరివాహక ప్రాంతం నుంచి 67 జాతీయ రహదారి వరకు చేరుస్తున్న స్మగ్లర్లు హైదరాబాద్, ముంబయి, చెన్నై, కోల్‌కతాలకు ఎగుమతి చేస్తున్నారు. పనిలో పనిగా నాగర్‌కర్నూల్ జిల్లాలో కూడా సరఫరా చేస్తూ యువకులను గంజాయి మత్తులో దించుతున్నారు. సారా తయారీ కూడా జిల్లాలో విపరీతంగా పెరిగిపోయింది. జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాలు గుడుంబా తయారీకి కేంద్రాలుగా మారాయి.



నాగర్‌కర్నూల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖ మంత్రి సొంత జిల్లాలో గంజాయి, గుడుంబా గుప్పుమంటున్నాయి. టీనేజర్లు టార్గెట్‌గా గంజాయి అమ్మకాలు సాగుతుండడంతో వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుడుంబా వ్యాపారం కూడా అడ్డగోలుగా సాగుతోంది. దీని తయారీకి ఉపయోగించే నల్లబెల్లం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుండడం గమనార్హం. జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాలు గుడుంబా తయారీకి కేంద్రాలుగా మారాయి.

టీనేజర్లే లక్ష్యంగా గంజాయి అమ్మకాలు

నల్లమల అటవీ ప్రాంతంలో సాగు చేసిన గంజాయిని మైదాన ప్రాంతాలకు తరలిస్తూ స్మగ్లర్లు కాసుల పంట పండించుకుంటున్నారు. నల్లమలలో గుట్టుగా సాగు చేసిన గంజాయిని కృష్ణానది పరివాహక ప్రాంతం నుంచి 67 జాతీయ రహదారి వరకు చేరుస్తున్న స్మగ్లర్లు హైదరాబాద్, ముంబయి, చెన్నై, కోల్‌కతాలకు ఎగుమతి చేస్తున్నారు. పనిలో పనిగా నాగర్‌కర్నూల్ జిల్లాలో కూడా సరఫరా చేస్తూ టీనేజర్లను గంజాయి మత్తులో దించుతున్నారు. మూడు రోజుల క్రితం నాగర్‌కర్నూల్‌లో ఇద్దరు మైనర్లు గంజాయి సరఫరా చేస్తూ పోలీసులకు చిక్కిన విషయం తెలిసిందే. జూన్‌లో బిజినేపల్లి మండలం గుడ్లనర్వలో మూడు గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొల్లాపూర్ మండలంలో ఇప్పటి వరకు మూడు గంజాయి కేసులు నమోదయ్యాయి. నాలుగు నెలలక్రితం తుర్కపల్లిలో గంజాయి సాగు చేస్తున్న రైతు పట్టుపడగా దానిని కొనుగోలు చేయడానికి వచ్చిన ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.


ఇప్పలపల్లిలో బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

జోరుగా సారా విక్రయాలు

జిల్లాలో నాటుసారా విక్రయాలు కూడా యథేచ్ఛగా సాగుతున్న ఎక్సైజ్ అధికారులు చోద్యం చూస్తున్నట్లు విమర్శలున్నాయి. పెద్దకొత్తపల్లి మండలంలో 69 గుడుంబా కేసులు నమోదు కాగా 38మంది నిందితులు పట్టుబడ్డారు. 16,450 లీటర్ల బెల్లం పానకాన్ని పడేశారు. 370 కిలోల నల్లబెల్లం, 20కిలోల నవసాగరంతోపాటు 8 వాహనాలను సీజ్ చేశారు. చారకొండ మండలంలో జనవరి 1 నుంచి జూలై 24 వరకు 27సారా కేసులు నమోదు కాగా 11మంది అరెస్టు అయ్యారు. 90 కేజీల నల్ల బెల్లం, 265 లీటర్ల నాటుసారాను పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు 30 మందిని బైండోవర్ చేశారు. కొల్లాపూర్ మండలంలో జనవరి నుంచి జూన్ వరకు 166 నాటుసారా కేసులు నమోదు కాగా 77 మందిని అధికారులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి 627లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. నాలుగు బెల్లం రవాణా కేసులు నమోదు కాగా ఇందులో ఆరుగురిని అరెస్టు చేశారు. మండలంలోని సున్నపు తండా, బోడబండ, గేమ్యానాయక్ తండాల్లో నాటుసారా వ్యాపారం జోరుగా సాగుతోంది. కల్వకుర్తి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో కూడా నాటుసారా విక్రయాలు ఊపందుకున్నాయి. సర్కిల్‌లో ఇప్పటి వరకు 202 కేసులు నమోదు కాగా 119 మందిని అరెస్టు చేసి 184 మందిని బైండోవర్ చేశారు. 8,215 కేజీల బెల్లం పట్టుబడింది. నాటుసారాను తరలిస్తున్న 23 వాహనాలను సీజ్ చేశారు. తెలకపల్లి ఎక్సైజ్ సర్కిల్‌లో 135 కేసులు నమోదు కాగా 127 మందిని ఇప్పటి వరకు అరెస్టు చేశారు. 11,500 కిలోల బెల్లం పట్టుబడింది. 21 వాహనాలను సీజ్ చేసి 26 మందిని బైండోవర్ చేశారు. అచ్చంపేట పరిధిలోని అమ్రాబాద్, బల్మూరు, పదర మండలాల్లో కూడా నాటుసారా విక్రయాలు పెరిగాయి. జనవరి నుంచి జూన్ వరకు 151 నాటుసారా కేసులు నమోదయ్యాయి. 118 మందిని అరెస్టు చేశారు. 865 లీటర్ల నాటుసారా దొరకగా 4,220 కిలోల బెల్లం పట్టుబడింది. 92 మందిని బైండోవర్ చేశారు. వెల్దండ, ఉప్పునుంతల, పెంట్లవెల్లి, కోడేరు మండలాల్లో కూడా పరిస్థితి ఇందుకు భిన్నంగా లేకపోవడం గమనార్హం. వెల్దండలో బొలెరో వాహనంలో 540 కిలోల నల్లబెల్లాన్ని తరలిస్తుండగా ఫిబ్రవరి 14న పోలీసులు పట్టుకున్నారు. ఉప్పునుంతల ఎక్సైజ్ పరిధిలో 135 కేసులు నమోదు కాగా 127 మందిని అరెస్టు చేశారు. 11,500 కిలోల బెల్లం పట్టుబడింది. పెంట్లవెల్లిలో 75 కేసులు కాగా 77 మందిని అరెస్టు చేసి 3,170 కిలోల బెల్లం సీజ్ చేశారు. కోడేరు మండలంలో 32 కేసుల్లో 16 మందిని రిమాండ్‌కు పంపించారు. ఇవి అధికారికంగా ఉన్న గణాంకాలు కాగా నల్లబెల్లం అక్రమ రవాణాకు సంబంధించి ఇంకా అనేక కేసులు బయటకు రావడం లేదు. గుట్టుచప్పుడు కాకుండా బెల్లం అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది. లిక్కర్ ధరలు పెంచడంతో మద్యం ప్రియులు క్రమంగా నాటుసారాకు అలవాటు పడుతున్నారు.

పురుగుల అన్నం, కుళ్లిన కూరగాయలు

- పెంట్లవెల్లి కస్తూర్బా విద్యార్థినులు అస్వస్థతకు కారణం
- పేద విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం
- పట్టించుకోని జిల్లా ఉన్నత విద్యాధికారులు


పెంట్లవెల్లి కస్తూర్బా పాఠశాలలో కుళ్లిన కూరగాయలు


పెంట్లవెల్లి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే కూరలో తేలియాడుతున్న పురుగులు

కొల్లాపూర్, ఆగస్టు 4 : పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్య నాణ్యమైన భోజనమందిస్తున్నామని ఒక వైపు ప్రభుత్వం ప్రకటన చేస్తుంది. మరో వైపు ప్రభుత్వ ఆదేశాలను ఆచరణలో పెట్టాల్సిన కస్తూర్బా పాఠశాల ల నిర్వాహకులు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెంట్లవెల్లి పట్టణంలో దాదాపు 200 మందికి పైగా విద్యనభ్యసించే కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు నిత్యం కుళ్లిన కూరగాయలు, పురుగుల అన్నం వడ్డిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆదివారం ఏకంగా 25మంది విద్యార్థినులు ఆహారం తిని తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మూడు రోజుల నుంచి వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో బాధపడు తున్న విద్యార్థులు ఆదివారం ఇక తమ బాధను భరించలేమని ఉపాధ్యా యులకు చెప్పారు. చేసేదేమీ లేక అంబులెన్స్‌లో కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుళ్లిన కూరగాయలతో పాటు విద్యార్థుల కోసం వండిన అన్నం, కూరగాయలలో కూడా పురుగులు వస్తున్నాయని చెప్పిన ఉపాధ్యాయులు ఎవరూ పట్టించుకోలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో నీటి వసతి లేక కనీసం మూడు నాలుగు రోజులకొకసారి స్నానాలు చేస్తుండడంతో వైరల్ వ్యాధులు సోకి ఒళ్లంతా పుండ్లు అవుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని నెలల నుంచి ఇదే తతంగం కొనసాగుతోందని తమ బాధను ఇక్కడ ఎవరూ పట్టించుకోవడం లేదని విద్యార్థులు పేర్కొన్నారు. తీవ్ర అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించిన మంత్రి జూపల్లి కృష్ణారావు విద్యార్థుల తీవ్ర అస్వస్థతకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డీఈవో గోవిందరాజులును ఆదేశించారు.


కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సకోసం వచ్చిన విద్యార్థినులు

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

బాలానగర్, ఆగస్టు 4 : రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం నుంచి నందారం గ్రా మానికి ద్విచక్ర వాహనంపై యాదగిరి అనే యువకుడు వెళ్తుండగా కారు ఢీకొన్నది. తీవ్ర గాయాలపాలైన యువకున్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న యాదగిరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. బాధితుడి సోదరుడు నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే మండలంలోని పెద్దాయపల్లి చౌరస్తాలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రంగా గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. అంబులెన్స్ వాహనంలో ఆసుపత్రికి తరలించారని వెల్లడించారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఉప్పునుంతల, ఆగస్టు 4: మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు అయిన ఘటన ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలో చోటుచేసుకొంది. ఎస్సై లెనిన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల ఒకటిన మధ్యాహ్నం ఉప్పునుంతల మండలంలో వరుసకు బావ అయిన ఓ వ్యక్తి మహిళ ఇంట్లోకి వచ్చి అసభ్యంగా ప్రవర్తించేందుకు ప్రయత్నించాడు. మళ్లీ అదే రాత్రి మరోమారు యత్నించాడు. గట్టిగా కేకలు వేయడంతో ఇంటిపక్కల వారు రావడంతో పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జోగుళాంబకు ప్రత్యేక పూజలు



జోగుళాంబ సన్నిధిలో భక్తులు



ఎంపీ రఘునందన్‌రావుకు స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

అలంపూరు, ఆగస్టు 4: ఆషాఢ మాసం చివరి అమావాస్య సందర్భంగా అలంపూరు పుణ్య క్షేత్రమైన జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. భక్తులు తంగభద్రనది తీరాన పుణ్య స్నానమాచరించి జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ఆలయంలో గణపతి పూజ, స్పర్శదర్శనం, సంతానం కోసం రేణుక ఎల్లమ్మకు పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి త్రిశతి అర్చనలు, ఖడ్గమాల అర్చనలు, ఒడిబియ్యం, చీర, గాజులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జోగుళాంబ అమ్మవారి యాగశాలలో భక్తుల ఇక్కట్లకు గురయ్యారు. దాదాపు ఆషాఢమాసం చివరి అమావాస్య కారణంతో 414 మంది భక్తులు హోమంలో పాల్గొన డానికి వచ్చారు. అయితే యాగశాలలో వారికి కూర్చోవడానికి స్థలం లేక నిలబడ్డారు. పరిమితికి మించి టికెట్లు ఇచ్చారని ఆలయ అధికారులపై భక్తులు మండిపడ్డారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

అలంపూరు పుణ్యక్షేత్రంలోని జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి వార్లను తెలంగాణ రాష్ట్రం మెదక్ ఎంపీ రఘునందన్ రావు సతీసమేతంగా దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ, అర్చకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి ఆలయంలో గణపతి పూజ, అభిషేకం నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో అర్చన చేశారు. వేద ఆశీర్వచన మండపంలో వారికి శేష వస్త్రాలు అందిచి సత్కరించారు. అలాగే నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సతీసమేతంగా దర్శించుకున్నారు. అలాగే బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్, నాయకులు ధనుంజయ గౌడ్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయంలో అర్చన చేసి తీర్థ ప్రసాదాలు అందించారు.

మూడు ఉద్యోగాలు సాధించిన శివాని


శివాని

ఊట్కూర్, ఆగస్టు 4 : నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రానికి చెందిన తొగటి శివాని ఒకే సారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన రిటైర్డు హెచ్‌ఎం తొగటి కృష్ణయ్య, మక్తల్ కేజీబీవీ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మీ దంపతుల కుమారుడు వంశీకృష్ణ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. వంశీ కృష్ణకు జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెం దిన శివానితో వివాహం జరిగింది. ఎంటెక్ (సివిల్) పూర్తి చేసిన శివాని ప్రభుత్వ ఉద్యో గాల అర్హత పరీక్షలకు సిద్ధం అవుతోంది. ఇప్పటికే టీజీపీఎస్సీ, బ్యాంక్ ఉద్యోగాల పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తోంది. ఇటీవలే విడుదలైన టీజీపీఎస్సీ ఫలితాల్లో మొదటి ప్రయత్నంలోనే మిషన్ భగీరథలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) ఉద్యోగం సాధించింది. అదే విధంగా గత నెల ఎస్‌బీఐ బ్యాంక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జూనియర్ అసోసియెట్ ఉద్యోగం సాధించింది. టీపీబీవో పరీక్షా ఫలితాల్లో సైతం బాసర జోన్‌లో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంక్ సాధించి ఉద్యోగం సాధించింది. ఊట్కూర్‌కు చెందిన యువతి ఏకంగా మూడు ఉద్యోగాలకు ఎంపిక కావడంతో ఆమెను పలువురు అభినందిస్తున్నారు.

బైక్‌పై లిఫ్ట్ ఇస్తామని చోరీ

ఖిల్లాఘణపురం, ఆగస్టు 4 : ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు లిఫ్ట్ ఇస్తామని ఒక యువకుడిని వాహనంపై ఎక్కించుకుని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి సెల్‌ఫోన్, బ్యాంకు ఖాతాలోని డబ్బులను చోరీ చేసిన సంఘటన వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని షాపూర్ గ్రామానికి చెందిన కుంభం రమేష్ గతనెల 31న ఉదయం తొమ్మిది గంటలకు గ్రామ బస్‌స్టాప్ వద్ద మండల కేంద్రానికి వెళ్లేందుకోసం బస్సు కోసం నిరీక్షిస్తున్నాడు. దారిలో బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అతన్ని ఎక్కించుకొని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ రమేష్‌ను కత్తితో బెదిరించి అతని ఫోన్ పే ద్వారా తమ ఖాతాలకు రూ.19500 ట్రాన్స్‌ఫర్ చేయించుకొని అక్కడే వదిలిపెట్టి వెళ్లిపోయారు. జరిగిన ఘటనను రమేష్ ఇంటికెళ్లి తండ్రికి వివరించగా వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై శ్రీహరి సైబర్ క్రైమ్ ఫిర్యాదుగా కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్, టీవీఎస్ ఢీ : ఒకరికి గాయాలు

తెలకపల్లి, ఆగస్టు 4 : మండల పరిధిలోని రాకొండ గ్రామ శ్మశాన వాటిక వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. దీనికి సంబంధించి గ్రామస్థుల కథనం ప్రకారం.. రాకొండకు చెందిన ట్రాక్టర్, టీవీఎస్ ఢీకొనడంతో ఒకరు గాయపడ్డారు. గాయపడ్డ వ్యక్తి నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం జిన్‌కుంట గ్రామానికి చెందిన జహంగీర్‌పాష తన టీవీఎస్‌పై తెలకపల్లికి వెళ్లి తిరిగి తన గ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో రాకొండ శ్మశాన వాటిక వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో అతడికి గాయాలు కాగా నాగర్‌కర్నూల్‌లోనే ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.

ఆర్‌అండ్‌బీ రోడ్లకు పట్టా పాసుపుస్తకాలు

- భూసేకరణ చేసినా రికార్డులలో తొలగని వైనం
- అధికారులతో చేతులు కలుపుతున్న భూ ముఠా
- పట్టణానికి సమీపంలో ఉండటంతో కోట్ల రూపాయాల విలువ

గద్వాల, ఆగస్టు 4: జోగుళాంబ గద్వాల జిల్లా దినదినాభివృద్ధి చెందుతుండగా భూముల విలువలు కూడా అంతే వేగంగా పెరుగుతున్నాయి. కొన్నేళ్ల నుంచి రియల్ వ్యాపారంలో లక్షలు, కోట్లల్లో లాభాలు చూసిన రియల్టర్లు భూములలో పెట్టుబడులు పెడుతుండగా మరికొంత మంది వివాదంలో ఉన్న భూములను తక్కువకు కొనుగోలు చేసి కోట్లు సంపాదించాలనే అత్యాశకు పోతున్నారు. రెవెన్యూ రికార్డులలోని లొసుగులను ఆధారం చేసుకొని ఆర్‌అండ్‌బీ రోడ్లకు పాసుపుస్తకాలు పుట్టించారు. వాటిని ఆధారంగా చేసుకొని పొజిషన్ కోసం పోట్లాటకు పోతున్నారు. దీంతో గద్వాలలో రోజు రోజుకు భూ వివాదాలు పెరిగిపోతున్నాయి.

ఆర్ అండ్ బీ రోడ్లకు పట్టాబుక్కులు

గద్వాల నుంచి ఎర్రవల్లి రోడ్డు, గద్వాల నుంచి అయిజ రోడ్డుకు ఇరువైపుల ఉన్న భూములకు కోట్లల్లో విలువలు ఉన్నాయి. రియల్ వ్యాపారం జోరుగా ఉంది. ఒక్కోప్లాటు ఖరీదు కోటికిపైగా ఉంటుంది. దీంతో భూ ముఠాలు వివాదాలు కలిగిన భూములపై దృష్టిపెట్టి తక్కువ ధరకు కొనుగోలు చేయాలని దృష్టి పెట్టాయి. ఆర్‌అండ్‌బీ రోడ్లకు సేకరించిన భూమి రికార్డులలో తొలగించకపోవడంతో వాటిని కొనుగోలు చేసి పొజిషన్‌కోసం పోతున్నారు. జమ్మిచేడు సమీపంలో కోట్లల్లో విలువ ఉన్న సర్వే నెంబరు 320పి, 342పి, 343పి, 344పిలో 5ఎకరాల 30 గుంటల భూమి ఉంది. దీనిని 2014లో వ్యవసాయేతర భూమిగా మార్చారు. 2017లో లే అవుట్ అనుమతులు పొందారు. 341లో రెండు ఎకరాల ఒక గుంట భూమి ఉంది. ఇదికూడా వ్యవసాయేతర భూమి. ఇందులో ఎకరా 12 గుంటల భూమిని నీలమ్మకు, 20గుంటల భూమి ప్లాట్లకు, ఏడు గుంటల భూమి కాలనీ రోడ్డుకు, మరో 12 గుంటలు ఆర్‌అండ్‌బీ రోడ్డులో పోయింది. రికార్డులో(7+12) తొలగించక పోవడంతో రోడ్డులో వెళ్లిన భూమికి రెవెన్యూ అధికారులతో చేతులు కలిపి మళ్లీ 21 గుంటల భూమికి పట్టా పాసుపుస్తకాలు పొందారు. ఇది భూ వివాదానికి దారితీసింది.

> **రికార్డులను పరిశీలిస్తాం**
>
> ఆర్‌అండ్‌బీ రోడ్లకు పట్టాపాసు పుస్తకాలు ఇచ్చారనే విషయం నాకు తెలియదు. ఆర్‌అండ్‌బీ సేకరించిన భూసేకరణ చూసి వాటిని తొలగిస్తాం. వివాదంలో ఉన్న జమ్మిచేడు రికార్డులను పరిశీలిస్తాను. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్నా.. అయినప్పటికీ పరిశీలిస్తాను.
>
> – కర్ణాకర్, ఇన్‌చార్జి తహసీల్దార్, గద్వాల


ఈ ఆర్‌అండ్‌బీ రోడ్డుకు పట్టాపాసుపుస్తకాలు జారీ

జమ్మిచేడులో అన్నీ వివాదాలే..

ముల్కలపల్లి రెవెన్యూ గ్రామం నుంచి జమ్మిచేడు కొత్తగా ఏర్పడిన రెవెన్యూ గ్రామం రికార్డులు సక్రమంగా లేకపోవడంతో చాలావరకు భూ వివాదాలు నెలకొంటున్నాయి. ఇప్పటికే పార్ట్-బీ లో చాలా సర్వేనెంబర్లు ఉన్నాయి. పొజిషన్‌లో ఉన్న భూమి కంటే రికార్డులలో ఎక్కువ నమోదులు ఉండటం వివాదాలకు కారణం అవుతున్నాయి. సర్వే నెంబరు 42, 43లో కూడా ఆర్‌అండ్‌బీలో భూమి పోయింది. కానీ రికార్డులో తొలగించకపోవడంతో అక్కడ వివాదం ఉంది. సర్వే నెంబరు 321, 336, 341లో కూడా ఇదే పరిస్థితి. ఇవే కాకుండా అయిజ రోడ్డులో సర్వే నెంబరు 783, 871లో కూడ రోడ్డులో పోయిన భూమికి రికార్డులు పుట్టించి పొజిషన్‌కు పోతున్నారు. ఈ వివాద భూములు తక్కువ ధరకు కొనుగోలు చేయడానికి భూ ముఠాలు ఏర్పడ్డాయి. గతంలో విద్యాసంస్థను నిర్వహించిన అధినేతతో పాటు మరికొందరు అతనితో చేతులు కలిపి వివాదాలకు కారణం అవుతున్నారు. వీరికి రెవెన్యూతో పాటు ప్రజా ప్రతినిధులు సహకరిస్తుండటంతో వీరి ఆగడాలు మితిమీరిపోతున్నాయి.

భూ కబ్జా యత్నాన్ని అడ్డుకున్న గ్రామస్థులు

జడ్చర్ల, ఆగస్టు 4 : సర్వే నెంబరులో ఎక్సెస్‌గా మిగిలిన భూమిని కబ్జా చేసేందుకు అధికార పార్టీ నాయకుడు య త్నించగా, గ్రామస్థులు అడ్డగించిన సంఘటన ఆదివారం జ డ్చర్ల మండలం లింగంపేట గ్రామ శివారులో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు... లింగం పేట శివారులో సర్వే నెంబరు 863లోని సుమారు 6 ఎకరాల భూ మిని గ్రామానికి చెం దిన ఓ అధికార పార్టీ నాయకుడు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నాడని, అందులో భాగంగానే పంట పండిం చేందుకు విత్తనాలు వేస్తుండగా అడ్డుకున్నామని గ్రామస్థులు తెలిపారు. గ్రామ శివారులో ఓ పట్టాదారుడికి 98 ఎకరాల పట్టా భూమి ఉందని, ఇటీవల ఆ భూమిని విక్ర యించగా భూమి సర్వే నిర్వహించారని తెలిపారు. సర్వే నిర్వ హించగా సుమారు ఆరు ఎకరాల భూమి అదనంగా తేలిం దని, నాటి నుంచి నేటి వరకు ఆ భూమి ఎవరి ఆధీనంలో లేదని పేర్కొన్నారు. కాగా గ్రామంలోని యువకులంతా క్రికెట్ ఆడుకునేందుకు గ్రౌండ్ ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. కోట్ల రూపాయల విలువ చేసే సదరు భూమిపై అధికార పార్టీకి చెందిన నాయకుడి కన్ను పడిందని, ఆ భూమిని కబ్జా చేసేందుకు నెల రోజులుగా యత్నిస్తున్నాడని, దీంతో గత నెల 22న భూమిని కాపాడాలంటూ జడ్చర్ల తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి విజ్ఞప్తి చేశామని వివరించారు. అదనంగా మిగిలిన భూమి గ్రామ అవసరాలకు వినియోగించుకునేందుకు గ్రామస్థులంతా నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు.

అదనంగా మిగిలిన భూమికి సంబంధించిన పూర్తి వివరాలపై విచారణ చేపట్టి, గ్రామ అవసరాలకు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్‌ను కోరామని గ్రామస్థులు వెల్లడించారు. ఇదిలా ఉండగా సుమారు 35 సంవత్సరాల క్రితం ఆ భూమిలో తన తండ్రి పంటలు వేసుకునేవాడని, గత రెండేళ్ల క్రితం పంట వేయకపోవడంతో గ్రామస్థులు క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు చేసుకున్నారంటూ లింగం పేట గ్రామానికి చెందిన యాదయ్య స్థానిక విలేకరులకు వివరించారు. ప్రస్తుతం ఆ భూమిలో పంటలు వేసుకునేందుకు దున్ని, విత్తనాలు నాటుకుండుండగా కొందరు అడ్డుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ అవసరాలకు వినియోగించాల్సిన భూమి కబ్జా కాకుండా చూడాలంటూ గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.

సీతాఫల్.. టెండ ‘రింగ్’

- కాంట్రాక్టర్‌లు రింగ్ అయి తక్కువధరకు వేలం
- కాయలు ఎక్కువగా వచ్చే మహ్మదాబాద్ డివిజన్‌కు గతేడాది తక్కువ కోడ్
- నేడు అటవీశాఖ కార్యాలయంలో సీతాఫల్ సేకరణకు టెండర్


మహబూబ్‌నగర్‌లోని అటవీశాఖ కార్యాలయం

మహబూబ్‌నగర్, ఆగస్టు 4 : అడవిలో లభించే సీతాఫల్‌కు పాలమూరులో పెద్దఎత్తున డిమాండ్ ఉంది. వర్షాకాలం వచ్చిందంటే వందల సంఖ్యలో సీతాఫలాలు సేకరించి మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. అడవిలో లభించే సీతాఫల్ సేకరణకు అటవీశాఖ ప్రతీఏటా టెండర్లు నిర్వహిస్తుంది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ సీతాఫలాలు సేకరించి చిరువ్యాపారులకు విక్రయించుకుంటారు. పాలమూరు జిల్లాలో మహ్మదాబాద్ ఫారెస్ట్ డివిజన్‌తో పాటు మహబూబ్‌నగర్ డివిజన్‌కు రెండు టెండర్లు నిర్వహిస్తారు. మహ్మదాబాద్ పరిధిలో మహ్మదాబాద్, కులక్‌చర్ల, చౌడాపూర్‌లు రాగా, మహబూబ్‌నగర్ పరిధిలో నవాబ్‌పేట, జడ్చర్ల, రాజాపూర్ మండలాలు వస్తాయి. ఈ రెండు డివిజన్‌లలో ఈ ఏడాది సీతాఫలాల సేకరణకు సోమవారం అటవీశాఖ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించనున్నారు. అయితే వేలంపాటలో పాల్గొనే కాంట్రాక్టర్లు కొందరు రింగ్‌గా మారి తక్కువ ధరకు టెండర్ దక్కించుకుంటున్నారన్న ఫిర్యాదులున్నాయి. వీళ్లు టెండర్ దక్కించుకుని ఆ తరువాత ఇతరులకు సబ్‌కాంట్రాక్ట్ ఇస్తున్నారు. గతేడాది మహబూబ్‌నగర్ డివిజన్‌కు రూ.2.80 లక్షలు, మహ్మదాబాద్ డివిజన్‌కు రూ.1.80 లక్షలకు టెండర్ తీసుకున్నారు. వాస్తవానికి మహ్మదాబాద్ డివిజన్ పరిధిలో అంతా అటవీప్రాంతమే. అక్కడ కాయ ఎక్కువగా వస్తోంది. అయినా మహబూబ్‌నగర్ డివిజన్ కన్నా తక్కువ టెండర్‌కు దక్కించుకుంటున్నారంటే కాంట్రాక్టర్‌లు సిండికేట్‌గా మారుతున్నారన్న విషయం స్పష్టమవుతోంది. మహబూబ్ నగర్ డివిజన్ కన్నా రెండు, మూడురెట్లు అధికంగా టెండర్ పాడాల్సిన చోట తక్కువ ధరకే దక్కించుకుంటూ ఇద్దరు, ముగ్గురు సబ్ కాంట్రాక్టర్‌లకు మూడురెట్లు అధికంగా లీజుకు ఇస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. గతంలో రూ.5 లక్షల వరకు టెండర్ పాడిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇందుకు అధికారులు కూడా సిండికేట్‌కు సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈసారైనా అధికార యంత్రాంగం పారదర్శకంగా వేలం పాట నిర్వహించి ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాలి. కాగా కొందరు వ్యాపారులు మాత్రం ఈసారి చెట్లకు ఇంకా పిందె రాలేదని, ఇప్పుడిప్పుడే పూత పూస్తుందని, ఇప్పుడు టెండర్ పాడితే కాయకాసి పంట వచ్చేసరికి అక్టోబరు, నవంబరు వస్తుందని వాపోతున్నారు. పూతను చూసే టెండర్‌లో పాల్గొనాల్సి వస్తుందని, వర్షాలు సరిగా రాకుంటే కాయలు కాయక నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు.

రూ.5 వేలు డిపాజిట్

జిల్లా అటవీశాఖ కార్యాలయంలో సోమవారం ఉదయం 11:30 గంటలకు టెండర్ నిర్వహించనున్నారు. టెండర్‌లో పాల్గొనదలిచిన వాళ్లు ముందుగా రూ.5 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

ఉమ్మడి పాలమూరు జిల్లా బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక


జడ్చర్లలో ఎంపిక చేసిన ఉమ్మడి పాలమూరు జిల్లా బాలికల జట్టు క్రీడాకారులు

జడ్చర్ల, ఆగస్టు 4 : జడ్చర్ల మునిసిపాలిటీలోని బాదేపల్లి బాలుర జడ్పీహెచ్‌ఎస్‌లో జడ్చర్ల ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లా బాలికల ఫుట్‌బాల్ జట్టును ఆదివారం ఎంపిక చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి 48 మంది క్రీడాకారులు పాల్గొనగా, 25 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఆగస్టు 16న నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్టు పక్షాన పోటీలలో పాల్గొననున్నారు. బాదేపల్లికి చెందిన సునీత, సంగీత, అఖిల, నిఖిత, దివ్య, విజేత, జడ్చర్లకు చెందిన హారతి, అనూషలతో పాటు నారాయణపేటకు చెందిన శ్రీలత, భవానీ, బాలానగర్‌కు చెందిన సురేఖలు ఎంపికయ్యారని తెలిపారు. అలాగే కల్వకుర్తికి చెందిన అనంద వర్షిణి, వినూత, రుత్విక, ధ్యానాంజలి, మక్తల్‌కు చెందిన అంకిత, నందిని, మహబూబ్‌నగర్ కు చెందిన ఆయూష, సాన్విత, ఉష, అక్షర, దేవరకద్రకు చెందిన కవిత, ఆమన్‌గల్‌కు చెందిన పావని, వడ్డేపల్లికి చెందిన నీలిమ, నీరజలు ఎంపికయ్యారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ ఎంపిక కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, మోయిన్, కౌన్సిలర్ రఘురాంగౌడ్, సీనియర్ క్రీడాకారులు శ్రీను, శ్రీహరి, అన్సారీ, పీడీలు వడ్డెన్న, రాములు, రామకృష్ణ, కోచ్‌లు వెంకటరాములు, నికేశ్, రాజు, శేఖర్, నరేశ్, ప్రకాశ్, రాంలక్ష్మణ్, సాకేత్, కల్యాణ్ పాల్గొన్నారు.

బోర్డు తిప్పేసిండ్రు

- అయిజలో గుజరాత్ వ్యక్తి రియల్ మోసం
- రూ.80 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు పెట్టుబడులు

అయిజ, ఆగస్టు 4: అయిజలో రియల్ మోసం బట్టబయలు అయింది. ట్రేడర్స్ పేరుతో కోట్లు కొల్లగొట్టి పక్కకు తప్పుకోవాలనే ఆలోచనలో నిర్వాహకులు సంస్థ ఏర్పాటు చేశారు. అధిక వడ్డీలు, కమీషన్ల ఆశ చూపి ఉచ్చులోకి లాగిన సంస్థ వారు పెట్టుబడిదారులకు కుచ్చుటోపి పెట్టారు. ‘ఆంధ్రజ్యోతి’ శనివారం ‘రూ. లక్షకు రూ. 40 వేల వడ్డీ’ అనే శీర్షికన కథనం ప్రచురించింది. దీనితో సంస్థ వ్యవహారం అంత బట్టబయలు అయ్యింది. పెట్టుబడి పెట్టిన వ్యక్తులకు సమాధానం సంస్థ దగ్గర లేకపోవటంతో బోర్డు తిప్పేశారు. ఇంకా కార్యాలయం నుంచి సామగ్రి ఒక్కొక్కటిగా తరలించే పనిలో నిమగ్నమయ్యారు. గుజరాత్‌కు చెందిన వ్యక్తిని కలుపుకుని స్థానిక వ్యక్తులు ఆడిన ఆటనే ఏజీజీకే ట్రేడర్స్. ఇక వివరాలలోకి వెళితే.. అయిజ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో ఏజీజీకే ట్రేడర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరున గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్‌కు చెందిన కుందన్ మక్వాన అనే వ్యక్తి రియల్ ఎస్టేట్ పేరు మీద కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. వీరు చేస్తున్న వ్యాపార ప్రచారం రూ. లక్ష పెట్టుబడి పెడితే నెలకు రూ.40 వేలు చొప్పున లాభాల కింద అందజేస్తామనే ప్రచారం సాగింది. ఈ ప్రచారం పేరుతో మూడు నెలల వ్యవధిలో రూ.80 కోట్ల నుంచి రూ. 100 కోట్ల వరకు పెట్టుబడుల కింద జమ చేసుకున్నట్లు సమాచారం. ఒక వ్యక్తి రూ. 10 లక్షలు పెట్టుబడి పెడితే ఆ వ్యక్తికి నెలకు రూ. నాలుగు లక్షల కింద జమ చేస్తేమనే ప్రచారం సాగించారు. పెట్టుబడి పెట్టిన వ్యక్తి గ్యారంటీ కావాలంటే పోస్ట్‌డేటెడ్ చెక్కులు ఇస్తున్నట్లు తెలిసింది. అది కుదరలేదా స్థిరాస్తులను రిజిస్ట్రేషన్ చేయించేవారు. పెట్టుబడి పెట్టే వ్యక్తిని తీసుకు వచ్చే వ్యక్తికి సైతం కమీషన్ కింద నగదును అందజేస్తామని ప్రచారం సైతం ఉన్నది. ట్రేడర్సుకు, పెట్టుబడి పెట్టే వ్యక్తి ఏజెంటులా, మధ్యవర్తిలా ఉండే వ్యక్తి సైతం లాభం పొందేవాడు. ఒక వ్యక్తి రూ. 10 లక్షలు ట్రేడర్సులో పెట్టుబడి పెడితే పెట్టుబడిదారునికి రూ. నెలకు నాలుగు లక్షలు ఇచ్చేవారని తెలిసింది. మధ్యవర్తిలా వచ్చే ఏజెంట్‌కు లక్షకు రోజు రూ. 100, రూ. 20 లక్షలకు మధ్యవర్తికి ప్రతీరోజు రూ. రెండు వేలు అంటే నెలకు మధ్యవర్తికి రూ. 60 వేలు జమ చేసినట్లు సమాచారం. ప్రజల నుంచి రూ. 80 కోట్ల నుంచి రూ. 100 కోట్ల వరకు కుప్ప వేస్తున్న ఏజీజీకే ట్రేడర్సు కాస్త బోర్డు తిప్పేసింది. మొన్నటి దాకా కార్యాలయానికి ఉన్న నేమ్ ప్లేట్ బోర్డును కనబడకుండా చేశారు. ప్రధాన కార్యాలయానికి ఉన్న ఫ్లెక్సీ బోర్డును చించివేశారు. ప్రక్కనే ఉన్న మరో కార్యాలయానికి ఉన్న నేమ్ బోర్డును తెల్ల రంగుతో తుడిచి వేశారు.


ప్రధాన కార్యాలయం ముందు ఉన్న కార్యాలయ ఫ్లెక్సీ బోర్డు చించివేసిన దృశ్యం


అదనపు కార్యాలయ బోర్డుపై తెల్ల రంగు వేసిన దృశ్యం

14 గొర్రెలను ఎత్తుకెళ్లిన దొంగలు

బిజినేపల్లి, ఆగస్టు 4 : మండలంలోని మహదేవునిపేట గ్రామ సమీపంలో నిలిపిన గొర్రెల మందలోంచి గుర్తు తెలియని దుండగులు 14 గొర్రెలను ఎత్తుకెళ్లిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇదే గ్రామానికి చెందిన బాధిత గొర్రెల కాపర్లు ఆదివారం తెలిపిన వివరాల మేరకు... రోజులాగే సాయంత్రం వరకు గొర్రెలను మేత మేపుకొచ్చి కంచె కట్టి అందులో గొర్రెలను నిలిపారు. గ్రామ సమీపంలోనే జీవాలను నిలుపుకోవడంతో ఇద్దరు ఇంటికి వెళ్లగా, ఇద్దరు అక్కడే నిద్రించారు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు మందలోంచి వాహనంలోకి గొర్రెలను ఎక్కిస్తుండగా శబ్దం కావడంతో లేచి అరవడంతో వాహనాన్ని స్టార్ట్ చేసుకొని వేగంగా బిజినేపల్లి వైపు వచ్చినట్లు బాధిత గొర్రెల కాపర్లు శ్రీశైలం, బీరయ్య, తిరుపతయ్య, కర్రెన్నలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై నాగశేఖర్ రెడ్డి తెలిపారు. దొంగిలించిన గొర్రెల్లో ఐదు పెద్ద పొట్టేళ్లు, తొమ్మిది గొర్రెలు ఉండగా వాటి విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మోడల్‌స్కూల్ వసతిగృహం తనిఖీ


విద్యార్థినులతో మాట్లాడుతున్న అధికారులు

వెల్దండ, ఆగస్టు 4 : మోడల్‌స్కూల్ విద్యార్థినులకు సరైన వసతి సౌకర్యాలతోపాటు నాణ్యమైన భోజనం అందించాలని డీఈవో గోవిందరాజులు, మోడల్‌స్కూల్ అదనపు డైరెక్టర్ శ్రీనివాసాచారిలు సూచించారు. మోడల్‌స్కూల్ వసతిగృహంలో నాసిరకమైన భోజనంతో విద్యార్థినులు అస్వస్థతకు గురై ఆస్పత్రిపాలుకావడంతో ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు ఆదివారం గోవిందరాజులు, శ్రీనివాసాచారిలు వసతిగృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని సమస్యలను విద్యార్థినులను అడిగితెలుసుకున్నారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని, లేనిపక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కావద్దని పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో మెరుగైన ఫలితాలు వచ్చేలా కృషిచేయాలని ఎస్‌వో శ్రవంతి, ప్రిన్సిపాల్ పుష్పలతకు సూచించారు. అదేవిదంగా మౌలిక వసతులు మెరుగుపర్చేలా చర్యలు తీసుకుంటామని గోవిందరాజులు, శ్రీనివాసాచారిలు పేర్కొన్నారు.

పొలం దున్నుతుండగా విద్యుదాఘాతం

- ఎద్దు మృతి.. తప్పిన ప్రమాదం

పెద్దమందడి వీపనగండ్ల, ఆగస్టు 4 : పొలం దున్నుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురై ఎద్దు మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం వల్లభాపురం తండాలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన కాట్రావత్ రాముడు తన ఎద్దుల గడెం తీసుకొని ఉదయం ఓ రైతుకు బాడిగగా వెళ్లాడు. పొలం దున్నుతుండగా ప్రమాదవశాత్తు ఎర్త్ తీగ ఎద్దుకు తగిలింది. వెంటనే ఎద్దు పడిపోవడంతో విద్యుదాఘాతానికి గురైనట్లు గమనించి మరో ఎద్దును గడెం నుంచి తప్పించాడు. రాముడు చాకచక్యంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. పక్కనే ఉన్న రైతులు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేశారు. ఎద్దు మృతి చెందడంతో దాదాపు రూ.80 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

జడ్చర్ల, ఆగస్టు 4 : జడ్చర్ల మునిసిపాలిటీలోని బురెడ్డిపల్లి వెళ్లే దారిలోని పోచమ్మచెరువులో పడి పాతబజారుకు చెందిన మేకల సుధాకర్(41) మృతిచెందాడు. శనివారం సాయంత్రం చెరువు ప్రాంతంలోకి వెళ్లిన సుధాకర్ ప్రమాదవశాత్తు చెరువులో పడిఉంటాడని, సుధాకర్ భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. సుధాకర్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కూలి పని కోసం వెళ్లి మృతుడై కన్పించాడు

నాగర్‌కర్నూల్ క్రైం, ఆగస్టు 4 : కూలీ పని కోసం వెళ్లి చెంచేటి స్వామి(45) మృతుడై కన్పించాడని మృతుని భార్య నారమ్మ ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన స్వామి మేస్త్రీ పని చేసేవాడు. శనివారం కూలి పని కోసం వెళ్లిన అతడు ఆదివారం ఉదయం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ సమీపంలో మృతుడై కన్పించాడు. దీంతో ఈ సంఘటనపై మృతుని భార్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

చింతల చెరువు కాలువ పనులు పూర్తి చేస్తాం

» ఇరిగేషన్ ఏఈ భరత్


పూడిన కాలువ పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ భరత్

వనపర్తి రూరల్, ఆగస్టు 4 : చిట్యాల గ్రామంలోని రా చెరువు నుంచి అచ్యుతాపూర్ చింతల చెరువుకు నీళ్లు వచ్చే విధంగా పూడిన కాల్వ పనులు త్వరగా పూర్తి చేస్తామని ఇరిగేషన్ ఏఈ భరత్ అన్నారు. ఆదివారం వనపర్తి మండల పరిధిలోని అచ్యుతాపూర్ గ్రామ శివారులో గల పూడిన కాలువలను ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశానుసారం ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. గతంలో నీటి వనరులు ఉన్నప్పుడు బుద్దారం నుంచి వచ్చే నీళ్లు చిట్యాల ఊర చెరువుకు, అది నిండిన తరువాత రా చెరువుకు అక్కడి నుంచి కాలువల ద్వారా అచ్యుతాపూర్ చింతల చెరువుకు వచ్చేవి. ఈ మధ్యకాలంలో వ్యవసాయ పొలాలకు బాట కోసం రైతులు కొన్ని చోట్ల కాలువలను పూడ్చడం, మరికొన్ని చోట్ల చెట్లతో రాళ్లతో పూడ్చివేశారని రైతులు ఇరిగేషన్ ఏఈ భరత్‌కు విన్నవించుకున్నారు. అనంతరం ఏఈ మాట్లాడుతూ రైతులు ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని, పూడిన కాలువ గురించి ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. వారం, పదిరోజుల్లో కాలువ మరమ్మతులు చేపడతామని, రైతులు కూడా సహకరించాలన్నారు. కార్యక్రమంలో రైతులు తిరుపతయ్య, చక్రవర్తి, ఎల్లయ్య, చిట్యాల, అచ్యుతాపూర్ తదితరులున్నారు.

ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలి

» కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ దేవన్నయాదవ్


కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా సమావేశంలో మాట్లాడుతున్న దేవన్నయాదవ్

వనపర్తి టౌన్, ఆగస్టు 4 : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ దేవన్నయాదవ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కార్యాలయంలో జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ కోసం సైనికులు కష్టపడుతున్నట్లుగానే కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠను పెంచడం కోసం సోషల్ మీడియా అదేవిధంగా కష్టపడుతోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా చాలా కష్టపడిందనే విషయాన్ని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారని గుర్తు చేశారు. సోషల్ మీడియాలో కీలకమైన వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ ఎక్స్ ఇన్‌స్టాగ్రామ్ వంటి యాప్‌లను నిరంతరం సద్వినియోగం చేసుకుంటు పార్టీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలన్నారు. ప్రతిపక్ష కుట్రలను తిప్పికొడుతూ కాంగ్రెస్ పార్టీకి కవచంలా నిలవాలని సూచించారు. సమావేశంలో సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ పాతపల్లి చంద్రశేఖర్, అసెంబ్లీ కోఆర్డినేటర్లు డి.వెంకటేష్, గడ్డం వినోద్, మండలాల కోఆర్డినేటర్లు గట్టు రాజు, శ్రీకాంత్, సోప్పరి రమేష్, ప్రవీణ్‌కుమార్, జగదీష్, రాజు, సయ్యద్ రెహమాన్, మల్లేష్ తదితరులున్నారు.

మాంసాహారం వద్దు.. శాకాహారమే ముద్దు


గాంధీచౌరస్తాలో నినాదాలు చేస్తున్న ధ్యాన కేంద్రం సభ్యులు

ఆత్మకూరు, ఆగస్టు 4 : మాంసాహారం వద్దు.. శాకాహారమే ముద్దు అంటు హనుమా పిరమిడ్ ధ్యాన శక్తి మహాక్షేత్రం సభ్యులు ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని పురవీధుల గుండా ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాంసాహారం భుజించడం వల్ల లేని వ్యాధులను కొనితెచ్చుకోవడమేనని, శాకాహారం భుజించడం వల్ల ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. అహింసా ధర్మాన్ని పాటిస్తు ధ్యానం చేస్తే సుఖసంతోషాలతో పాటు ఆరోగ్యంగా, ఆనందంగా జీవిస్తామని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు అహింసా ధర్మాన్ని పాటిస్తు సుఖసంతోషాలతో జీవించాలని వారు కోరారు. కార్యక్రమంలో పిరమిడ్ ధ్యానశక్తి మహా క్షేత్రం సభ్యులు అంజనేయరెడ్డి, రఘుపతిరెడ్డి, ప్రభాకర్‌రావు, రాజుతో పాటు, అయా గ్రామాల ధ్యాన కేంద్రాల సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ, పాములపై అవగాహన


పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్

చిన్నంబావి, ఆగస్టు 4 : మండల పరిధిలోని గూడెం గ్రామంలో పర్యావరణ పరిరక్షణ, పాములపై సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్ అవగాహన కల్పించారు. గ్రామ యువకుడు శివసాగర్ నేతృత్వంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా కృష్ణసాగర్ మాట్లాడుతూ కృష్ణానది పరివాహక ప్రాంత సమీపంలో ఉండే గ్రామాల రైతులు, వ్యవసాయ కూలీలు, మత్స్యకారులు ప్రస్తుత పరిస్థితుల్లో నదిలోకి వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తున్నందున ఎక్కువగా ఎగువ ప్రాంతం నుంచి మొసళ్లు, పాములు గ్రామాల్లోకి వచ్చే ప్రమాదం ఉందని, ఎవరికైనా ప్రమాదవశాత్తు పాములు కరిస్తే నాటు వైద్యానికి వెళ్లకుండా ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని ఆయన సూచించారు. పెబ్బేరు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ రాణి మాట్లాడుతూ మొసళ్లు, కొండచిలువలు, పాములు, జింకలు తదితర అటవీ వన్యప్రాణులకు హాని తలపెట్టొద్దని సూచించారు. కార్యక్రమంలో సాగర్ స్నేక్ సొసైటీ సభ్యులు కుమార్, గోపాల్, లోకేష్, దేవేందర్, నవీన్‌ముదిరాజ్, అవినాష్, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

పెబ్బేరు-వనపర్తి రోడ్డును పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు


రోడ్డును పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెబ్బేరు, ఆగస్టు 4 : పెబ్బేరు నుంచి వనపర్తి వెళ్లే రోడ్డును బీఆర్ఎస్ పెబ్బేరు పట్టణ అధ్యక్షుడు వి.దిలీప్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సహకారంతో పెబ్బేరు నుంచి వనపర్తికి వెళ్లే రహదారిని దాదాపు 75 శాతం పనులు పూర్తి చేసి రోడ్డు అభివృద్ధి పనులు చేశారు. మిగిలిన 25 శాతం రోడ్డు పనిని ప్రస్తుత ప్రభుత్వం త్వరగా పూర్తి చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, గోనెల సహదేవుడు, వల్లపురెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాటమోని బసవరాజ్ గౌడ్, మేకల ఎల్లయ్య, గొడుగు శాంతన్న, సెల్విల్లా రమేష్‌గౌడ్, మాజీ వార్డు మెంబర్ రాములు, సిద్ది వెంకటయ్య, వి.శేఖర్‌ఆచారి, బీఆర్ఎస్ నాయకులు, మహిళలు, తెలంగాణ ఉద్యమకారుడు వజగౌని వెంకటన్నగౌడ్ తదితరులున్నారు.

బీజేపీకి అండగా దళిత సామాజిక వర్గం

ఖిల్లాఘణపురం, ఆగస్టు 4 : ఎస్సీ వర్గీకరణ సాధనకు కృషి చేసిన ప్రధాని మోదీకి, బీజేపీకి అండగా దళిత సామాజికవర్గం నిలుస్తుందని ఆ పార్టీ దళిత మండల నాయకుడు శివశంకర్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చట్టాల్లో సాహసోపేతమైన నిర్ణయాలు మోదీ వల్లే సాధ్యం అని కొనియాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి దళిత సమాజం అండగా ఉంటుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీలకు ఎక్కువ స్థానాల్లో అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో బీజేపీ మండల నాయకుడు కొరిగల గోపి, దళిత నాయకులు దాసు, రాజు, గిరిజన నాయకుడు హేమంత్‌నాయక్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

వనపర్తి రూరల్, ఆగస్టు 4 : వనపర్తి మండల పరిధిలోని అచ్యుతాపురం గ్రామ శివారులోని పంచముఖి ఆంజనేయస్వామికి, పెద్దగూడెం గ్రామ శివారులోని తిరుమలయ్యగుట్ట సమీపంలో గల పంచముఖి ఆంజనేయస్వామికి ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నంబావి మండలం అమ్మాయిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీశంకర్‌రెడ్డి దంపతులు అచ్యుతాపూర్ శివారులో గల పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, గ్రామ సర్పంచ్ శారద, ఆలయ కమిటీ చైర్మన్ పూజారి నవీన్‌శర్మ, పూజారి నరేందర్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘన లింగేశ్వర ఆలయంలో...

ఖిల్లాఘణపురం : మండల కేంద్రంలోని ఘన లింగేశ్వర భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అఖండ భజనలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మండల కేంద్రం పరిసర గ్రామాల ప్రజలు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం సింగిల్ విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి కుమార్తె, కీ.శే.రూపరెడ్డి, కీ.శే.పవన్‌కుమార్‌రెడ్డి జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాతల సహకారంతో ప్రతీ అమావాస్యకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సామాజిక కార్యకర్త కమ్మరి గోపి తెలిపారు.

గండిలో...

గోపాల్‌పేట : మండలంలోని బుద్దారం గ్రామ పరిధిలో ఉన్న గండి ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా ఆదివారం ఉదయం గండి ఆంజనేయస్వామి విగ్రహానికి అర్చకులు ప్రత్యేకంగా అభిషేకం, పూజ కార్యక్రమం జరిపించారు. అనంతరం గండి దేవాలయం నుంచి బుద్దారం గ్రామంలో వీధులగుండా భజన కీర్తనలతో స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. పల్లకీ సేవకు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రామస్థులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

● పెబ్బేరురూరల్ : సూగూరు గ్రామంలో చౌడేశ్వరిదేవి ఆలయంలో అమావాస్య పూజలు జరిగాయి. అమ్మవారి జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ శ్రీవారి సేవకులు సితార వెంకటేశ్వర్లు, తొగుటవీర క్షత్రియ సంఘం సభ్యులు పాల్గొన్నారు.


సూగూరు గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో నిర్వహిస్తున్న పూజలు


అచ్యుతాపూర్ గ్రామ శివారులోని పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో పల్లకిని మోస్తున్న భక్తులు

హక్కుల సాధన కోసం ఉద్యమించాలి

» ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి

» జిల్లా కేంద్రంలో సంఘం మూడో జిల్లా మహాసభలు



ఐద్వా మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి

వనపర్తి టౌన్, ఆగస్టు 4 : మహిళలు సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరిస్తు హక్కుల సాధన కోసం ఉద్యమించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ఐద్వా జిల్లా మూడో మహాసభలు జిల్లా అధ్యక్షురాలు ఉమ అధ్యక్షతన జరిగాయి. సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన అరుణజ్యోతి మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ఎన్నో చట్టాలు చేసినా ఫలితం మాత్రం లేదన్నారు. చట్టంలో లొసుగుల మూలంగా నేరస్తులకు రక్షణ కలుగుతోందని వివరించారు. మహిళాభ్యున్నతి కోసం సమాజంలో సమానత్వం, ప్రతీ రంగంలో రిజర్వేషన్ కల్పించాలని, జాతీయోద్యమం మొదలుకొని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వరకు అనేకమంది మహిళలు ఎంతో చైతన్యంతో పోరాటం చేశారని కొనియాడారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందికొండ గీత మాట్లాడుతూ మహిళలు లేని ఉద్యమాలు, పోరాటాలు లేవని అన్నారు. ప్రభుత్వాలు మహిళ రక్షణ కోసం పనిచేస్తున్నాయని ప్రకటిస్తున్నప్పటికీ ఆచరణలో వైఫల్యం చెందుతున్నాయని, సరైన రక్షణ లేకపోవడం వల్ల దాడులు పెరిగిపోతున్నాయని అన్నారు. హక్కుల సాధన కోసం పోరాటాలే ఏకైక మార్గం అని, అందుకోసం విశాల పోరాటాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి లక్ష్మి, సహాయ కార్యదర్శులు సాయిలీల, సువర్ణ, కవిత, శాంతమ్మ, లక్ష్మి తదితరులున్నారు.

సుప్రీంకోర్టు తీర్పును ఉపసంహరించుకోవాలి

» మాల ఉద్యోగుల సంఘం నాయకుల డిమాండ్


పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న మాల ఉద్యోగుల సంఘం నాయకులు

వనపర్తి టౌన్, ఆగస్టు 4 : ఇటీవల సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రాలకు అధికారం కల్పిస్తు ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలని మాల ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జైభీం స్వచ్ఛంద సేవ సంఘ భవనంలో పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాల ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి, ప్రధాన మంత్రికి, రాష్ట్రపతికి, ముఖ్యమంత్రికి పోస్టుకార్డు ద్వారా తమ వ్యతిరేకతను తెలియజేయడం కోసం ఈ ఉద్యమం ప్రారంభిస్తున్నామని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని కాపాడాలని, ఆర్టికల్ 341 ప్రకారం వర్గీకరణ చేసే అధికారాలు రాష్ట్రాలకు లేవని, అందుకు విరుద్ధంగా అధికారం ఇస్తు ఆదేశాలు ఇవ్వడం సరికాదన్నారు. సుప్రీంకోర్టు తన వైఖరిని మార్చుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని, ఆర్టికల్ 341ను కాపాడుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంఘం నాయకులు కంటె నిరంజనయ్య, మోజర్ల కృష్ణ, చెన్నకేశవులు, మూల ఆంజనేయులు, జెట్టి వెంకటస్వామి, జెట్టి రాంబాబు, కంటె చిన్న నిరంజనయ్య, బండారు శ్రీనివాసులు, డాక్టర్ శ్రీకర్, ఆవుల కురుమూర్తి, బాలస్వామి, శ్రీనివాసులు, శ్రీకాంత్, దాసరి కృష్ణ, సంధ్యారాణి, నాగన్న, నాగేశ్వర్, మోహన్, రామకృష్ణ, బాలు, నవీన్, విష్ణు, మలిపెద్ది వెంకటేష్ తదితరులున్నారు.

బకాయిలు చెల్లించి టెండర్లకు ఆహ్వానించాలి

» చేప పిల్లల సరఫరాదారుల సంఘం డిమాండ్

ఆత్మకూరు, ఆగస్టు 4 : గత ఏడాది బకాయిలు చెల్లించే వరకు టెండర్లకు ఆహ్వానించేది లేదని టెండర్‌దారులు శివ, ఏటిగాడి ఆనంద్ డిమాండ్ చేశారు. చేప పిల్లల పెంపకం ఆధారం చేసుకుని ఆరేపల్లి గ్రామ శివారులో వందల మంది జీవనం సాగిస్తున్నారు. గత ఏడాది కట్ల, రవ్వ, మృగుల, బొచ్చ, బంగారు తీగ, గడ్డిచేప, పలు రకాల చేప పిల్లలను ఉత్పత్తి చేసి ప్రభుత్వానికి సరఫరా చేశాం.. కానీ గత ఏడాదికి సంబంధించిన బకాయి ఇప్పటివరకు చెల్లించకపోవడంతో టెండర్లకు రాకూడదని టెండర్‌దారులమందరం స్వచ్ఛందంగా నిర్ణయించుకున్నామన్నారు. వర్షాకాలం ప్రారంభమై 40 రోజులు గడుస్తోంది.. ఆగస్టు మొదటి వారంలో చేప పిల్లలను నదులు, చెరువుల్లో వదిలివేయాల్సి ఉంది.. కానీ ఇప్పటివరకు గత ఏడాది బకాయిలను చెల్లించకపోవడంతో మత్స్యకారుల జీవన పరిస్థితి ఆగమ్యగోచరంగా మారే పరిస్థితి ఉందని వాపోయారు. ప్రభుత్వం వెంటనే గత ఏడాది బకాయిలు చెల్లించి టెండర్లకు ఆహ్వానించాలని టెండర్‌దారులు శివ, ఏటికాడి ఆనంద్‌లు డిమాండ్ చేశారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెద్దమందడి, ఆగస్టు 4 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1994-95 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. సమ్మేళనంలో అందరు కలిసి ఆనాటి స్నేహ బంధాన్ని, జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. నేటికీ 30 సంవత్సరాలు తరువాత అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం రోజు స్నేహితులను కలుసుకున్నందుకు చాలా ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. నాడు నేర్పించిన విద్యాబుద్ధులు, క్రమశిక్షణ ఎంతగానో ఉపయోగపడి జీవితంలో స్థిరపడేలా చేశాయన్నారు. కార్యక్రమంలో పరశురాములు, మీసేవ చారి, కరుణాకర్‌రెడ్డి, కొండల్, శ్రీశైలం తదితరులున్నారు.


పెద్దమందడిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జూరాల ప్రాజెక్టుకు కొనసాగుతున్న

పర్యాటకుల తాకిడి

అమరచింత, ఆగస్టు 4 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుపై సందర్శకుల తాకిడి భారీ సంఖ్యలో కొనసాగుతూనే ఉంది. ఎగువన కురుస్తున్న వర్షాలు, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి వదులుతున్న నీటి కారణంగా జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు 34 గేట్ల ద్వారా దిగువకు వరద నీటిని వదలడంతో ఒక్కసారిగా ఉమ్మడి జిల్లాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో ప్రాజెక్టుకు కృష్ణమ్మ సోయగాలను తిలకించడానికి తరలివస్తున్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో పర్యాటకులు భారీ సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. దీంతో జూరాల ప్రాజెక్టు ప్రధాన రహదారిపై ఎడమ కాలువ వద్ద వాహనాలు కిక్కిరిసి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రాజెక్టుపై తాగునీరు, నిలువ నీడ, పార్కింగ్ లేక పర్యాటకులు ఇబ్బందులకు గురయ్యారు. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు. పర్యాటకుల తాకిడి మరికొన్ని రోజులు ఇలాగే కొనసాగే అవకాశం ఉంది.


జూరాల ప్రాజెక్టుపై ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం



జూరాల ప్రాజెక్టుపై సెల్ఫీలు దిగుతున్న పర్యాటకులు

చౌడేశ్వరీదేవి ఆలయంలో

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

పెబ్బేరు, ఆగస్టు 4 : మునిసిపల్ కేంద్రంలోని చౌడేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువా, పూలమాలతో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు, బ్లాక్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, మండల నాయకులు సురేందర్ గౌడ్, రామచంద్రారెడ్డి, వెంకటేష్‌సాగర్, వెంకటరమణ, భానుప్రకాష్‌రెడ్డి, నరసింహనాయుడు తదితరులున్నారు.

యూత్ కాంగ్రెస్‌లో ఎన్నికల సందడి

» తొలిసారిగా ఆన్‌లైన్‌లో ఓటింగ్ ప్రక్రియ

» మద్దతు కోసం అభ్యర్థుల తిప్పలు

వనపర్తి రూరల్, ఆగస్టు 4 : మండల యువజన కాంగ్రెస్‌లో ఎన్నికల సందడి నెలకొంది. అభ్యర్థులు గెలుపు కోసం సర్వశక్తులుగా కష్టపడుతున్నారు. ఆన్‌లైన్‌లో ఓటింగ్ కావడంతో కార్యకర్తల మద్దతు కోసం శతవిధాలుగా ప్రయత్నిస్తున్నారు. మండల స్థాయిలో గెలుపొందిన వారు రాజకీయంగా కాంగ్రెస్ పార్టీలో కీలకపాత్ర పోషించనున్నారు అనే మాట వినబడుతోంది. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. హస్తం పార్టీకి క్షేత్రస్థాయిలో వెన్నుదన్నుగా యువజన కాంగ్రెస్ నిలుస్తోంది. ఇందులో భాగంగా పార్టీ అధిష్టానం యూత్ కాంగ్రెస్ ఎన్నికలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పటివరకు ఆ విభాగం నామినేటెడ్ రూపంలో నిర్వహించగా తొలిసారిగా ఆన్‌లైన్ ద్వారా చేపడుతున్నారు. మండల స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ఈ ప్రక్రియ కొనసాగుతోంది. నామినేషన్ల దాఖలు నుంచి ఫలితాలు వెల్లడి వరకు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే చేపట్టనున్నారు. మండల అధ్యక్ష పదవిలో ప్రస్తుతం చందాపూర్ గ్రామానికి చెందిన ఉప సర్పంచ్, జిల్లా ఉప సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆవుల చంద్రశేఖర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న చందాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్‌లు పోటీలో ఉన్నారు. ఆన్‌లైన్ ఎన్నికల నిర్వహణ కోసం విత్ ఐవైసీ అనే ప్రత్యేక యాప్‌ను ఉపయోగిస్తున్నారు. నేటి నుంచి సెప్టెంబర్ ఐదో తేదీ వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుండడంతో బరిలో నుంచి అభ్యర్థులు పార్టీ ప్రధాన నాయకుల ఆశీస్సులతో పాటు యువత మద్దతును కూడగట్టుకునే దిశగా ప్రయత్నాలు సాగిస్తున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

వీపనగండ్ల, ఆగస్టు 4 : మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేవీపీఎస్ మండల కార్యదర్శి మురళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామంలో సమితి నాయకులు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ పలు కాలనీల్లో సీసీ రోడ్లు ఉన్నప్పటికి సైడ్ కాలువ లేకపోవడం వల్ల మురుగునీరు రోడ్లపై పారుతుందన్నారు. ఎస్సీ కాలనీలో విద్యుత్ లైట్లు లేకపోవడం వల్ల రాత్రివేళల్లో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇళ్ల మధ్య పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని, కాలనీలో మురుగునీటి గుంతలు ఉన్నాయని ప్రజలు తమ దృష్టికి తెచ్చినట్లు ఆయన తెలిపారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారమయ్యే విధంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఆశన్న, రైతు సంఘం నాయకుడు ఈశ్వర్, ఎస్ఎఫ్ఐ నాయకుడు రామకృష్ణ తదితరులున్నారు.

నిబద్ధత గల అధికారి లక్ష్మణ్‌నాయక్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు 4 : వృత్తి ధర్మాన్ని చిత్తశుద్ధితో అవలంబించిన నిబద్ధత గల అధికారి లక్ష్మణ్‌నాయక్ అని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. పాన్‌గల్ ఎంఈవోగా పద్నాలుగు సంవత్సరాల పాటు పనిచేసి ఇటీవల బదిలీపై రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలానికి వెళ్లిన లక్ష్మణ్‌నాయక్‌ను సాహితీ కళావేదిక సభ్యులు ఆదివారం ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌నాయక్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు చంద్రశేఖర్, గణేష్, జీసీడీవో శుభలక్ష్మి, ఉపాధ్యాయులు బైరోజు చంద్రశేఖర్, కంటే నిరంజనయ్య, స్వామి, గంధం నాగరాజు, బండారు శ్రీనివాసులు, మోహన్, జగన్, గోవింద్ తదితరులున్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

అమరచింత, ఆగస్టు 4 : అనారోగ్యంతో ఆదివారం మృతి చెందిన తెలుగు తిరుమలేష్ కుటుంబానికి తోటి మిత్రులు రూ.40 వేల ఆర్థిక సాయం అందించారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ తిరుమలేష్ మృతి చెందడంతో పది సంవత్సరాల పాటు కలిసి చదువుకున్న స్నేహితులు ఆయన పార్థివదేహానికి మిత్రులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు రూ.40 వేల నగదు అందజేశారు. స్నేహితుల దినోత్సవం రోజు తోటి స్నేహితుడిని కోల్పోవడంపై మిత్రులు తీవ్రంగా రోదించారు. కార్యక్రమంలో మిత్రులు తాటికొండ రమేష్, హర్ష వెంకటేష్, దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డి, మహేందర్, రఫీ, శ్రీను, జుబేర్, శాఫాయత్, ఖదీర్, విష్ణు, అక్బర్, భాస్కర్, సర్దార్, సురేందర్, నరసింహ తదితరులున్నారు.

పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానానికి 250 ప్లేట్లు వితరణ

వనపర్తి రూరల్, ఆగస్టు 4 : వనపర్తి మండల పరిధిలోని అచ్యుతాపూర్ గ్రామ శివారులో గల పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానానికి ఆదివారం చిట్యాల ముందరితండా గ్రామ సెక్రటరీ పల్లవి వేణుగోపాల్‌రెడ్డి దంపతులు 250 ప్లేట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పూజారి నవీన్‌శర్మ, వనపర్తి మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో అచ్యుతాపురం మాజీ గ్రామ సర్పంచ్ శారద ఆశన్ననాయుడు, కౌన్సిలర్ బ్రహ్మం తదితరులున్నారు.

'యువత దేశ ప్రగతి కోసం ఉద్యమించాలి'

ఆత్మకూరు, ఆగస్టు 4 : యువత దేశ ప్రగతి కోసం కలిసి మెలసి ఉద్యమించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుతుబ్ అన్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో స్నేహితులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కారల్ మార్క్స్, ఎంగెల్స్, చేగువేరా, క్యాస్ట్రో, భగత్‌సింగ్, రాజుగురు, సుఖ్‌దేవ్‌ల స్నేహంతో కలిసిమెలసి సమసమాజ స్థాపనకు సిద్ధమవ్వాలని తెలిపారు. కుట్రలు కుతంత్రాలు మత విద్వేషాలను రెచ్చగొట్టకుండా స్నేహభావంతో కలిసి మెలసి దేశ ప్రగతి కొరకు ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో రవి, వసీం, యూసుఫ్, సమీర్, జిలాని మహమూద్, చరణ్ తదితరులున్నారు.